# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్ రాజు





# – 16 –

## పెంట కష్టాల కథ

**ఓ వారం క్రితం** "ఈ సారి ఏమైనా పెంట చేసి తీరాల్సిందే" అన్నాను మా క్వీన్ విక్టోరియా తో ఆవేశంగా....

"ఏం చెయ్యాలి అన్నావ్?" అనుమానంగా అడిగింది మా క్వీన్ విక్టోరియా.

"అదే. పెంట" రెట్టించాను కోపంగా. ఆ కోపం ఆవిడ మీద కాదు. మా చె.చె.కంపెనీ మీద.

"అంటే నువ్వు రోజూ వంటింట్లో చేసేదేగా" అంది అక్కడికి అదేదో అర్థం అయిపోయినట్లుగా మా మహారాణి.

మరదే....నేను రోజూ కష్టపడినా, ఇష్టపడి ఒక వేపుడు కూర, లేకపోతే టొమేటో పచ్చడి, ఇంకా ఆవేశం వస్తే పొట్లకాయ పెరుగు పచ్చడి లాంటివి చేసి తరిస్తుంటే ఆవిడ అక్కడికి అదేదో తను భరిస్తున్నట్టు ఓవర్ ఏక్షన్ ఎందుకు చెప్పండి. నిజానికి "భార్య అనగా బాధించేది. భర్త అనగా భరించే వాడు." అని కదా వేదాల్లో ఘోషించినది. పైగా నేను పై పెంట డవిలాగు చెప్పినప్పుడు ఇద్దరం వంటింట్లో లేం. చేతిలో చెయ్యి వేసుకోకుండా మా ఇంటి ముందు పెద్ద కుప్పలా పోసి ఉన్న మా మాజీ అరటి చెట్ల అవశేషాల కేసి నిస్సహాయంగా చూస్తున్నాం. ఆ ఎండి పోయిన అరటి ఆకులు, ఈ ఏటి చలికి చచ్చి పోయి వేలాడుతున్న బోదెలూ, మా ఫెర్నాండేజ్ గాడు వారం ముందు కోసి పోగేసిన గడ్డి, గాదమూ అన్నీ కలిసి మూడడుగుల ఎత్తూ, ఆరడుగుల పొడుగూ, నాలుగడుగుల వెడల్పు ఉన్న ఆ కుప్పతో ఇప్పుడు ఏం చెయ్యాలా అనే యక్ష ప్రశ్నకి నాకు తట్టిన నాకు వచ్చినదే ఈ అద్భుతమైన పెంట ఆలోచన. అంటే ఇక్కడ నా ఆలోచన పెంట కాదు అనియూ, పెంట తయారు చేయుట అనేది నా అద్భుతమైన ఆలోచన అనియూ గ్రహించ ప్రార్థన.

అసలు ఇంత పెద్ద కుప్ప తయారు అవడానికి మొదటి కారణం గత ఏడాది శీతాకాలంలో మా హ్యూస్టన్ లో ఎప్పుడూ లేని విధంగా ఉష్ణోగ్రత రెండు, మూడు సార్లు నీరు గడ్డకట్టుకు పోయే సున్నా డిగ్రీలకి పడిపోయింది. ఈ ఉష్ణోగ్రత యవ్వారం టీవీలో చెప్తూనే ఉన్నా కుండీలలో వాటిని ఉన్న గరాజ్ లో పెట్టుకుని, నేల మీద పాతిన వాటికి రగ్గులు, దుప్పట్లు కప్పి కాపాడుకోడానికి బాగా చలేస్తోంది కదా బద్ధకించేశాం. మా ఫెర్నాండేజ్ గాడి చేత ఆ పని చేయిద్దాం అనుకుంటే శీతాకాలం రాగానే గడ్డికోసే పని ఉండదు కాబట్టి రెండు నెలలు పెళ్ళాం తో కాపరం చేయడం కోసం మెక్సికో వెళ్ళిపోయాడు. దాంతో మా తోటలో ఉన్న ఇరవై అడుగుల ఎత్తు అరటి మొక్కలు, మా ప్రపంచ ప్రఖ్యాత పదిహేను అడుగుల ఎత్తు కరివేపాకు చెట్లు రెండు, ఐదారు రంగుల మందారాలు, పూల మొక్కలు ..ఒకటేమిటి ...అన్నీ గడ్డకట్టి పిడచ కట్టుకుపోయి చచ్చి ఊరుకున్నాయి. ఇప్పుడు ఆ శీతాకాలం వెళ్ళి పోయి, వసంత మాసం రాగానే...అంటే మార్చ్ నెల రాగానే ..అంటే మన



ఉగాది సమయానికి మళ్ళీ కూర మొక్కలు, పూల మొక్కలూ వేసుకోడానికి తయారు అయిపోయాం. కానీ ఈ వెధవ అమెరికాలో తోటలోఅ చచ్చి పోయిన మొక్కలన్నింటినీ కొట్టేసి వీధిలోనో, పక్కింటి వాడింట్లోనో పారేస్తే మనల్ని మూసేస్తారు. అమెరికా జైళ్ళ లో ఎయిర్ కండిషనింగ్ ఉండదుట. చికాకు అయిపోతుంది. అంచేత మా పేట వాళ్ళు కాంట్రాక్ట్ ఇచ్చిన “చె.చె. కంపెనీ” వాడు పెట్టిన నిబంధనల ప్రకారమే అన్నీ జరగాలి. “చె.చె. కంపెనీ” అంటే వారానికో సారి పెద్ద పెద్ద లారీలతో వచ్చి మనం బయట పెట్టిన చెత్తా చెదారం పట్టుకెళ్ళే కంపెనీ అనమాట. చూశారూ…ఆఖరికి మన సొంత చెత్తా చెదారం బయట పారేసే విషయంలో కూడా ఈ దేశంలో స్వాతంత్ర్యం లేదు. పేరుకి మటుకు అమెరికా స్వాతంత్ర్య దేశమే కానీ ఇలాంటి వాటిల్లో మన పవిత్ర భారత దేశాన్ని మించిన స్వాతంత్ర్య దేశం లేనే లేదు. జై మహాత్మా గాంధీకీ! జై ప్రకాశం పంతులూ!

ఉదాహరణకి మా “చె.చె.కంపెనీ” వాడి నిబంధనల ప్రకారం ఎండిపోయిన గడ్డి, ఆకులు అయితే వాటిని వాడే ఇచ్చిన నా సైజులో ఉండే ఒక పెద్ద ఒక నల్ల రంగు ప్లాస్టిక్ డబ్బాలో నింపాలి. అదే కనక కాగితాల లాంటి రీసైక్లింగ్ సరుకు అయితే పసుపు రంగు డబ్బాలలో కుక్కి పెట్టాలి. ఒక సారి కాకినాడలో కార్పొరేషన్ వారు ఆవేశపడి ఇలాంటి పద్ధతే ప్రవేశ పెట్టి పౌరులకి ప్లాస్టిక్ డబ్బాలు ఇస్తే మర్నాటికి సగం పైగా అందులో చెత్త అక్కడే పారబోసి ఆ డబ్బాలు దొంగలు కొట్టుకు పోయారు…అదీ అసలు సిసలు స్వాతంత్ర్యం అంటే.. హ్యూస్టన్ లో డబ్బాలు నింపడం వరకూ పరవా లేదు కానీ చచ్చిన చెట్ల దుంగలయితేనే చచ్చే చావు. ఎందుకంటే చచ్చినట్టు వాటిని షోగ్గా మూడు అడుగులకంటే తక్కువ పొడుగ్గా ఉండేలా ఒకే సైజు ప్రకారం మాత్రమే కోసి, అలాంటివి కొన్ని కలిపి చుట్టూ తాడు వేసి కట్టి, అలా చేంతాడుతో చుట్ట బెట్టిన కట్ట బరువు పాతిక కేజీల కంటే తక్కువ ఉండేలా చూసుకుని, అలాంటి కట్టెల కట్టలు ఇరవై దాటకుండా చూసుకోవాలి. వీటన్నిటినీ సరిగ్గా ఒక రోజు ముందు మాత్రమే వీధి గుమ్మం వేపు ఉండే సైడ్ వాక్…వాహనాలు వెళ్ళే అసలు రోడ్డు మీద కాదు సుమా…మనుషులు కుక్కలని నడిపించే రోడ్డు మీద పెట్టాలి. అనకూడదు కానీ వీటి మీద మీరు ఓ దుప్పటీ కప్పారనుకోండి. ఇంటి ముందు శవాలు పడుకోబెట్టినట్టు ఉంటుంది ఆ సీను. ఒక వేళ రెండు, మూడు రోజుల ముందే కనక చెత్త డబ్బా కానీ, ఈ శవాల కట్టలు కానీ సైడ్ వాక్ మీద పెడితే పేట యాజమాన్యం వాళ్ళు చివాట్లు వేస్తూ ఉత్తరము వ్రాయుటయే కాక, జరిమానా కూడా వేయుదురు. ఈ సారి మా తోటలో చాలా మొక్కల దుంగలు..అంటే పుచ్చిపోయిన అరటి దూటలే పాతిక పైగా ఉండడంతో మా ఫెర్నాండేజ్ గాడు వాడి సెకండ్ సెకట్ అప్ – అవును. అసలు పెళ్ళాం మెక్సికో లో ఉంటుంది కావున ఇక్కడ అమెరికాలో టెంపరరీ ఏర్పాటు అనమాట…అంతే కాదు వాళ్ళిద్దరూ వాళ్ళ భాషలో ఆడుతు పాడుతు పనిచేసుకుంటున్నారు కాబట్టి మొగుడూ పెళ్ళాలు ఆయె ఛాన్స్ లేదుగా..– వాళ్ళిద్దరూ ఒక రోజంతా పని చేసి నా సైజులో ఉన్న ఆ నల్ల, పసుపు గార్బేజ్ డబ్బాలు నింపేసి, ఆయా అరటి చెట్లని నరికి పోగులు పెట్టి, మా తోటని శుభ్రం చేసి అక్షరాలా రెండు వందల తొంభై ఐదు డాలర్లు మరియు పెట్రోలు ఖర్చులకి మరొక పదిహేను ఖర్చులు దండుకుని ఉడాయించారు. ఫెర్నాండేజ్ అతని ప్రేయసీ….మందహాసాలు చేసుకుంటూ….దొంగ చూపులు చూసుకుంటూ…



శుభ్రంగా ఉన్న మా తోట కేసి గర్వంగా చూసుకుని “హమ్మయ్య, ఈ ఏడు కూడా మళ్ళీ తోట కూరా, గోంగూరా వేసుకోవచ్చును కదా, అరటి చెట్టు ఎలాగా మళ్ళీ మొలుస్తుందిగా” అని నేను అనుకుంటూ ఉంటే “నీ మొహం .ఫెర్నాండేజ్ గాదికిచ్చిన డబ్బుతో రెండేళ్ళకి సరిపడా తోటకూరా, గోంగూరా కొనుక్కోవచ్చును కదా. నీకు ఆయాసం ఎక్కువ, వ్యవసాయం తక్కువా” అని ప్రవచించింది మా క్వీన్ విక్టోరియా. ఇదంతా..అంటే మా తోట శుభ్రం చేసే పని అంతా మొన్న శని వారం పూర్తి అయింది. మా చె.చె. కంపెనీ వాళ్ళు వచ్చి మేము బయట పెట్టిన చెత్తా, చెదారమూ తీసుకెళ్ళేది ప్రతీ బుధవారమూనూ….తీరా చూద్దుం కదా….లక్ష్మివారం పొద్దుటకి నా సైజు నల్ల, పసుపు గార్బేజ్ డబ్బాలలో ఉన్న ఆకులూ, అలములూ మా చె.చె. కమ్ వారు తీసుకెళ్ళారు కానీ… మూడడుగుల ఎత్తూ, ఆరడుగుల పొడుగూ, నాలుగడుగుల వెడల్పు ఉన్న ఆ కుప్ప అలాగే

ఎక్కడ వేసిన గొంగళీ లాగా అక్కడే ఉంది. దాని మీద ఎర్ర అక్షరాలతో ఓ పెద్ద పసుపు కాయితం గుచ్చి నన్ను వెక్కిరిస్తూ కనపడింది. "ఒరేయ్/ఒసేయ్ ఇంటి యజమానీ! మీకు బుద్ధి లేదా? ఎన్ని సార్లు మా రూల్స్ మీకు చెప్పి చావాలి? ఏ దుంగ లైనా సరే, కాండ లైనా సరే, మూడు అడుగుల లోపునే ఉండాలి. తాడుతో కట్టి, మా తాలూకు గోమెజ్ అనే అర్భకుడు చేతులతో ఎత్తి లారీలో కుదేసే బరువుని మించకూడదు. అంత వరకూ శలవ్". ఇదీ ఆ శ్రీముఖం సారాంశం. అంటే....మా ఫెర్నాండేజ్ భేతాళుడు చలికి చచ్చిన ఆ అరటి దూటల పార్థివ శరీరాలని తాడుతో కట్టకుండా, అలాగే సైడ్ వాక్ దగ్గర ఒక దాని మీద ఒకటి పేర్చేసి...కట్టినట్టుగా భ్రమింప జేసి ప్రేయసితో సహా మాయం అయిపోయాడు. కావాలంటే ఇందుతో జతపరిచిన ఫోటో చూడండి.

ఇప్పుడు ఈ పెద్ద కుంప చూడగానే ముందు "కొంప మునిగిందిరా బాబూ" అనిపించింది. కానీ వెంటనే "ఈ కుప్పని పెంట చేసి పర్యావరణాన్ని రక్షించి అవతల పారెయ్య వచ్చును కదా?' అనిపించి ఆ మాటే పైకి అన్నాను. ఆఫ్టరాల్...వెనకాల ఒక గొయ్యి తీసి ఈ చెత్తంతా అందులో పడేస్తే కొన్నాళ్ళకి అదే కుళ్ళి, ఎండకి ఎండీ, వానకి తడిసీ అదే ఎరువుగా మారుతుంది అని చిన్నప్పుడు సైన్సు పాఠం గుర్తుకి వచ్చింది. ఇక పార తీసుకుని గొయ్యి తియ్యడానికి తయారు అవుతుంటే కెవ్వు మని కేక పెట్టింది మా క్వీన్ విక్టోరియా. అది ఈ నాటి సినిమా కెవ్వు కేక కాదు –సంసార పక్షం కెవ్వు కేక.

"గోతిలో పెంట చేస్తే డేవిడ్ గాడు నిన్ను చంపేస్తాడు" అనే వార్నింగ్ ఆ కెవ్వు కేకకి అర్థం. ఎందుకంటే ఈ డేవిడ్ గాడు నా ప్రాణాలకి మా పక్కింటి అసలు సిసలు అమెరికన్ దొర. నేను కనక ఇలా గొయ్యి తీసి అందులో ఈ చెత్తా చెదారం వేశాను అని తెలిస్తే చాలు. ఓ రోజు దోమ కుట్టిందనో, మరో రోజు పెంట కంపు కొడుతోంది అనో రోజుకో దావా వేస్తాడు నా మీద. అంత దాకా ఎందుకూ – ఆ అరటి ఆకులు మా ఇద్దరి ఇంటి సరిహద్దు చెక్క ముక్కల గోడ దాటి వాడి ఇంటి వేపు వాలితే చాలు..వచ్చి మా ఇంటి తలుపు తడతాడు. మా కుక్క వాడి లాన్ లోకి వెళ్లిందో ...ఇక కాలు ఎత్తకుండా తరిమి కొడతాడు. ఇక ఏకంగా దోమలు, పెంట వాసనా వస్తే కోర్టులో దావా గేరంటీ.

డేవిడ్ వాడి బారి నుంచి తప్పించుకోడానికి కంపు లేని పెంట చేయుట ఎట్లు అని నేను మూడు రోజుల పాటు ఇక గూగులో, గూగులు. అమెరికాలో వాసన లేని పెంట చెయ్యడం వంటని పెంట చెయ్యడం అంత సులభం కాదు అని అప్పుడు తెలిసిపోయింది. అంటే ఎక్కడా మన చేతికి మట్టి అంటుకోకుండా పెంట చెయ్యాలంటే దానికి నాలుగు వందల తొంభై డాలర్ల తొంభై తొమ్మిది సెంట్లు పెట్టి అన్ని వేపులా మూసుకుని గాలి కూడా చొరబడ లేని, చొరబడిన గాలి బయట పడలేని ఒకానొక ప్రత్యేక కంపోస్ట్ చాంబర్ ట– అంటే పెంట డబ్బా కొనుగోలు చేసి, అందులో ఈ చెత్తా చెదారం వెయ్యాలి. దాని మీద ఆ కంపెనీ వారే అమ్మే మూడు గేలన్ల కంపోస్ట్ స్టార్టర్– అంటే "పెంట ప్రారంభ ద్రావకం"——కొని, ఆ డబ్బాలో అంతా కలిసేలా కలిపి మూత పెట్టి ఇంటి వెనకాల తోటలో ఎక్కడో ఓ మూల పెట్టుకోవాలట. వాడి శ్రాద్ధం కాకపోతే ఆ డబ్బా ఎవడైనా వంటింట్లో పెట్టుకుంటాడా? తోటలో పెట్టుకో అని వాడు చెప్పాలా? అంతే కాదు. నెలకో సారి ఆ కంపోస్ట్ డబ్బా మూత తీసి మరో మూడు గేలన్లు పోసి ఇలా...చేస్తూ పోతే రెండేళ్ళకి అంత పెద్ద కుప్పకీ ఏకంగా గుప్పెడు ఫెర్టిలైజర్ వస్తుందిట. అనగా ఇప్పుడు మా ఇంటి ముందు ఉన్న పెద్ద కుప్ప కి రెండేళ్ళు ఇంత సేవ చేస్తే మాకు దక్కేది మూడు గుప్పెళ్ళు సహజ పెంట. పైగా ఈ పెంట ప్రారంభ ద్రావకం ఖరీదు ఎంతో కాదు..కేవలం పద్నాలుగు డాలర్ల తొంభై తొమ్మిది సెంట్లుట. అదీ ఆ పెంట డబ్బా కొంటే స్పెషల్ డిస్కౌంట్ ట– దీనినే కదా అసమదీయులు చెవులో పువ్వు అందురు.

నాలుగు రోజుల పాటు ఈ తతంగం అంతా తెలుసుకుని ఇహ పెంట చేయుట మన వల్ల కాదు అనుకుంటూ ఉండగా వీధి గుమ్మం దగ్గర బెల్లు మోగింది. మా పోస్టు వాడు ఏదో సర్టిఫైడ్ ఉత్తరం అంటూ నా చేత సంతకం పెట్టించుకుని వెళ్ళిపోయాడు. ట్రంపు గారి ఆదాయం పన్ను కట్టడానికి, టాక్స్ రిటర్న్స్ పంపించడానికి ఏప్రిల్ 15 దాకా సమయం ఉంది కదా, అపుడే ఈ శ్రీముఖం ఏమిటీ అనుకుని ఆ కవరు విప్పి చూస్తే అది మా పేట యాజమాన్యం వారి దగ్గర నుంచి వచ్చిన తాఖీదు. "ఒరేయ్/ఒసేయ్ ఇంటి యజమానీ, మీకు అసలు బుద్ధి ఉందా? ఎన్ని సార్లు చెప్పాలి? మన పేట నిబంధనల ప్రకారం మీ చెత్తా, చెదారం ఆ చె.చె.కం వారు వచ్చే ముందు రోజు అనగా కేవలం మంగళ వారం మాత్రమే పైన పెట్ట వలెను. మీరు అది ఉల్లంఘించి శని వారమే పెట్టి చేసినది మొదటి తప్పు. ఆ తరువాత మరొక ఐదు రోజుల తరువాత కూడా ఆ చెత్తా చెదారం ఇంకా అక్కడే ఉంచి పట్టించుకోకపోవడం రెండవ, తీవ్రమైన తప్పు. కాబట్టి ఇందు మూలముగా మీకు వంద డాలర్లు జరిమానా విధిస్తున్నాము. అంతే కాక, మరొక 24 గంటలలో తగిన చర్యలు తీసుకుని మొత్తం శుభ్రం చెయ్యనిచో రోజుకి మరొక వంద చొప్పున జరిమానా విధించి, మా అంతట మేమే భా.చె.చె.కమ్ వారిని పిలిచి మీ అంత చెత్తా చెదారమునూ తొలగించే ఏర్పాటు చేయుదుము. దానికి అయ్యే ఖర్చు అంతా మీరే చెల్లించవలయును. లేదా మీరే వారిని పిలవ వచ్చును. వారి నెంబర్ ఫలానా." అదీ ఆ శ్రీముఖం సారాంశం.

"ఓరి ఫేర్నాడెంజూ, దౌర్భాగ్యుడా. ఎంత పని చేశావురా?" అని చెబ్దాం అని నేను వాడికి ఎన్ని సార్లు ఫోన్ చేసినా అవతలి నుంచి స్పానిష్ భాషలో గుర్రు గుర్రు మనే శబ్దం తప్ప సమాధానం లేదు. ఇక లాభం లేదు అని గోడు గోడుమని విలపిస్తూ వెంటనే మా పేట యాజమాన్యం వారు సూచించిన భా. చె. చె. కంపెనీ..అనగా రోజు వారీ సరుకు కాక భారీ చెత్తా చెదారం పట్టుకెళ్ళే వేరే ప్రవేటు కంపెనీని అర్జంటుగా పిలిచి, ఫోన్ మీదే రెండు వందల డాలర్ల తొంభై తొమ్మిది సెంట్లు ప్లస్ ఆరు శాతం పన్ను కట్టగానే గంటలో ఆ భా.చె.చె.కంపెనీ వారి లారీ దడ దడ లాడుతూ వచ్చేసింది. నాకు ఇన్ని కష్టాలు తెచ్చిపెట్టిన ఆ మొత్తం కుప్పలో అరటి మొక్క అవశేషాలు, కర్వేపాకు కాండలు లారీలో కులాసాగా వేసుకుంటున్న మెక్సికన్ ఆసామీని చూసి వీడిని ఎక్కడో చూసినట్టుందే అనుకుని...తకీమని వెలిగి "నువ్వా ఫెర్నాండేజూ"అని ఘాట్టిగా అరిచాను...వాడు విజయ గర్వంతో వెర్రి నవ్వు నవ్వుతూ లారీ లోకి దూకి చెయ్యి ఊపి స్పీడుగా పారిపోయాడు. "ఇదంతా బీజేపి, పవన్ కళ్యాణ్ మరియు జగన్ గారు చంద్ర బాబు మీద కుమ్మక్కు అయినట్టు ఫెర్నాండేజ్ గాడు, చె.చె.కమ్ వారు భా.చె.చె..కమ్ వారు నా మీద కుట్ర పన్నారేమో" అని నిస్సహాయంగా అప్పుడే రోడ్డు మళ్ళిన ఆ లారీ కేసి చూస్తూ చస్తే ఈ ఏడు వ్యవసాయం చెయ్యను గాక చెయ్యను. కూరలన్నీ బజార్లోనే కొనుక్కుందాం అని డిసైడ్ అయిపోయాను. సరిగ్గా అదే సమయంలో మా క్వీన్ విక్టోరియా తన భూతం లాంటి కారులో ఇంటికి వచ్చింది.

"ముగుడూ..ఓ సారి ఇలా రా..." అని డ్రైవ్ వే లోంచి పిలుస్తూ దర్జాగా కారు దిగింది క్వీన్ విక్టోరియా. తీరా వెళ్లి చూద్దును కదా....ఆవిడ పెద్ద కారు ట్రంక్, ముందు సీటు, వెనకాల సీటు..అన్నింటి లోనూ వంగ మొక్కలు, టోమేటోలు, బెండ..ఒకటేమిటి ఆ వెధవ చైనా వాడి నర్సరీ లో దొరికే అన్ని రకాల కూర మొక్కలూ కొనుక్కొచ్చేసింది నా ప్రాణాలకి..."నీకు ఓపిక లేకపోతే ఆ ఫెర్నాండేజ్ గాడిని పిలిచి అన్నీ తోటలో వేయించు. అన్నట్టు వెనకాల సీట్లో క్రిందన నాలుగు పెంట సంచీలు ఉన్నాయి. ఒక సంచీ 13-13-13 గులాబీలు మరియు ఇతర పూల మొక్కల పెంట, మరోటి 14-14-14 టొమేటేలు ఇతర కూర మొక్కల ఎరువు, 15-15-15 ఏపుగా ఎదిగి పాకే వాటికి ప్రత్యేక పెంట, మరియు 16-16-16 అన్నింటికీ పనికి వచ్చే సూపర్ పెంట...అన్నట్టు గడ్డి పెరగడానికి ద్రావకం పెంట...ఇది డబ్బాలో ఉంటుంది. అవి మర్చి పోకు"".

ఓరి నాయనోయ్ !

**COMMENTS**